క్లుప్తంగా

యువకుడికి గాయాలు



వేలేరు : రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన పీచర క్రాస్ రోడ్డు సమీపంలోని పిట్టలగూడెం మలుపు వద్ద సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గొల్లకిష్టంపల్లి గ్రామానికి చెందిన నాసాని సాయికుమార్ దసరా పండుగకు నర్మెటలోని తన అత్తగారింటికి బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో పిట్టలగూడెం మలుపు వద్ద బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కనున్న పెద్ద బండరాయిని ఢీకొట్టింది. దీంతో అతడికి తల, ముఖం భాగాల్లో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

మద్యం స్వాధీనం

ధర్మసాగర్: మండలంలోని క్యాతంపల్లిలో వెలసిన బెల్టుషాపులపై పోలీసులు మంగళవారం దాడులు చేసి అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించి బెల్టుషాపు నడుపుతున్న మోడెం రాజమ్మ వద్ద రూ.7129 విలువ గల అక్రమ మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీస్‌లు వెల్లడించారు.

గీత కార్మికుడికి గాయాలు

ఎల్కతుర్తి: కల్లు తీసేందుకు తాటిచెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ సంఘటన మండలంలోని బావుపేటలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బత్తిని కనుకయ్య వృత్తి రీత్యా గ్రామ శివారులోని తాటి చెట్టు ఎక్కి కల్లు తీస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు మోకు జారీ కిందపడ్డాడు. గమనించిన తోటి కార్మికులు ఆస్పత్రికి తరలించారు.

కేసు నమోదు



నడికూడ: దసరా ఉత్సవాల్లో యువకుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఎస్సై శివకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని ముస్త్యాలపల్లిలో సోమవారం దసరా ఉత్సవాలు జరిగాయి. ఈ క్రమంలో గ్రామానికి చెందిన బొమ్మకంటి విజయ్‌పై అదే గ్రామానికి చెందిన కొంతమంది యువకులు దాడి చేశారు. ఈ దాడిలో అతడికి తీవ్ర గాయాలుకాగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాధితుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు



ధర్మసాగర్: పేకాడుతున్న వ్యక్తులను పోలీస్‌లు అరెస్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ముప్పారం శివారులో పేకాడుతున్నారనే సమాచారంతో సీఐ శ్రీధర్‌రావు పేకాట స్థావరంపై దాడులు చేశారు. ఈ దాడుల్లో 9 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.20,991 నగదు 6 సెల్ ఫోన్లు, 5 బైకులు స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో సీఐ శ్రీధర్ రావు, పోలీస్ సిబ్బంది రాజేందర్, జన్ను రమేష్, సంపత్ పాల్గొన్నారు.

యూసీసీఆర్ఐ(ఎంఎల్)ను ఆశీర్వదించాలి

ఆత్మకూరు: ప్రజల పక్షాన నిలబడే యూసీసీఆర్ఐ (ఎంఎల్) అభ్యర్థులను ఆశీర్వదించాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు పీరస్వామి మంగళవారం ప్రకటనలో కోరారు. భూమి, స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం కోసం నిరంతరం పోరాడేది యూసీసీఆర్ఐ అని, ప్రజలందరూ అండగా నిలవాలని కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ఐనవోలు: మండలంలోని రాంనగర్ సర్పంచ్ శ్రీనివాసరావు సోదరుడు సురేష్ కుమార్, ఐనవోలు గ్రామానికి చెందిన మున్సిపాలిటీ వర్కర్ ఎర్ర(కుర్ర) స్వామి మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అరూరి రమేష్ మంగళవారం ఎంజీఎం మార్చురీలోనున్న మృతదేహాలను పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, స్థానిక ప్రజాప్రతినిధులు ఉన్నారు.

ఘనంగా జన్మదినం

శాయంపేట: తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్ జన్మదినం మంగళవారం మండలంలోని పెద్దకోడపాక రాజరాజేశ్వర ఆలయంలో ఆ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి అమ్మ అశోక్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు పాల్గొన్నారు.

పరకాల: రావణాసుర దహనాన్ని తిలకిస్తున్న ప్రజలు



పరకాల: దసరా వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే



కమలాపూర్‌లో..



ఎల్కతుర్తి: రావణాసుర దహనాన్ని తిలకిస్తున్న ప్రజలు



ఘనంగా విజయదశమి వేడుకలు

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లో సోమవారం విజయదశమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం 11గంటలకు జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్థానిక భూలక్ష్మి అమ్మవార్ల వద్ద దసరా వేడుకలు వైభవోపేతంగా నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీస్‌స్టేషన్‌లలో ఎస్సైలు రాజ్‌కుమార్, సాయిబాబు, వెంకటేశ్వర్లు అయుధ పూజ నిర్వహించారు. అనంతరం గ్రామ పంచాయతీ వద్ద వెలసిన దుర్గామాత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన భక్తులు రావణాసుర వధను కనులారా తిలకించారు.

పరకాల: పట్టణంలో విజయదశమి వేడుకలు సోమవారం భక్తి శ్రద్ధలతో జరిగాయి. బొడ్రాయి వద్ద జంతుబలి అనంతరం శ్రీచెన్నకేశవాలయం నుంచి రాముల వారి విగ్రహాన్ని రథంపై శ్రీకుంకుమేశ్వర స్వామి దేవస్థానం వరకు ఊరేగింపు నిర్వహించారు. అక్కడే జమ్మి పూజ చేసి పశువుల సంత ఆవరణంలో ఏర్పాటు చేసిన రావణసుర వధ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకలను తిలకించేందుకు వేలాది మంది ప్రజలు తరలివచ్చారు. ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ హాజరై విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

జమ్మి పూజపై భక్తుల ఆందోళన..

కుంకుమేశ్వరస్వామి దేవస్థానం వద్ద జమ్మిపూజలో జరిగిన పొరపాటుపై భక్తులు ఆందోళన నిర్వహించారు. వృక్షం కొమ్మ స్థానంలో జమ్మిని పోలిన మరో చెట్టు కొమ్మను ఏర్పాటు చేసి తమ మనోభావాలను దెబ్బతీశారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. దేవస్థానం వద్దకు చేరుకున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణ ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించిన వారిపై చర్య తీసుకోవాలని స్థానిక బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.

కమలాపూర్: మండల వ్యాప్తంగా విజయదశమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఆయా గ్రామాల్లోని జమ్మిచెట్ల నుంచి జమ్మి ఆకులు సేకరించి స్నేహితులు, బంధువులకు అందించి దసరా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జమ్మి ఆకులను తల్లిదండ్రులు, పెద్దలకు ఇచ్చి ఆశీస్సులు పొందారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని పోలీస్ స్టేషన్‌లో పోలీసులు ఆయుధ పూజ నిర్వహించారు. దసరా వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా స్థానిక ఇన్‌స్పెక్టర్ సంజీవ్, ఎస్సై కరుణాకర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

దామెరలో..

దామెర: మండల వ్యాప్తంగా సోమవారం దసరా వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. మండల కేంద్రంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ దేవతలైన భూ దేవి, మహాలక్ష్మి, బొడ్రాయి, నవగ్రహాలు, పోతరాజుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోచమ్మ ఆలయం సమీపంలో జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించగా గ్రామస్తులు జమ్మిని పంచుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జెడ్పీటీసీ కల్పనకృష్ణమూర్తి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు కృపాకర్‌రెడ్డి, సర్పంచ్ శ్రీరాంరెడ్డి, నాయకులు శంకర్, రాజు(కేసీఆర్), రాజు, నాగేశ్వర్‌రావు, పెద్దలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు. అలాగే ఊరుగొండలో సర్పంచ్ గోగుల సత్యనారాయణరెడ్డి, ప్యాక్స్ చైర్మన్ బొల్లు రాజు, వైస్ ఎంపీపీ జాకిర్‌అలీ, కోగిల్వాయిలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గట్ల విష్ణువర్ధన్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అక్తర్, డైరెక్టర్ గుండా చంద్రమోహన్, ఒగ్లాపూర్‌లో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ కేతిపెల్లి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై ముత్యం రాజేందర్ బందోబస్తు నిర్వహించారు.

నడికూడ: మండల వ్యాప్తంగా దసరా వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. గ్రామస్తులు డప్పు చప్పుళ్లతో బోనం తీసుకెళ్లి దుర్గామాత వద్ద పూజ చేసి, జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి గ్రామస్తులందరూ పాలపిట్టను చూశారు. ఈ వేడుకల్లో సర్పంచ్‌లు ఊర రవీందర్ సాంబశిరెడ్డి, పెండ్లి రాజు, పాలకుర్తి సదానందం, గూడెం కష్ణమూర్తి, సాదు నిర్మల, బొట్ల సంధ్యరవి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామస్తులు జమ్మి పూజల్లో పాల్గొని జమ్మి ఆకు ఒకరికొకరు పంచుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు. పెద్దాపూర్‌లో రావణసర వధ కార్యక్రమాన్ని ఏసీపీ కిషోర్‌కుమార్ ప్రారంభించారు. సర్పంచ్ సావురే కమలరాజేశ్వర్‌రావు, జెడ్పీటీసీ రాధికరాజు, బొల్లోజు కుమారస్వామి పాల్గొన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సీఐ రవిరాజు ఆయుధ పూజ నిర్వహించారు.

ఐనవోలు: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం దసరా ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ప్రధాన కూడళ్లలో సర్పంచ్‌లు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో దసరా వేడుకల్లో భాగంగా ఆనగపుకాయ, మరికొన్ని గ్రామాల్లో యాటను నైవేద్యంగా సమర్పించారు. అనంతరం పాలపిట్ట దర్శనం చేసుకుని జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జమ్మి ఆకును పెద్దలకు పంచుతూ ఆశీర్వాదం తీసుకున్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్సై వంగాల నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ఆయుధ పూజ నిర్వహించగా ఎస్‌బీ ఎస్సై చక్రధర్, ఇంటలీజెన్స్ ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

శాయంపేట: మండల దసరా వేడుకలు ఘనంగా జరిగాయి. మత్స్యగిరి స్వామి ఉత్సవ దేవత మూర్తులను ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ మల్లేష్, ఎస్సై దేవేందర్‌లు ఆయుధ పూజ చేశారు. అలాగే మత్స్యగిరిస్వామి ఉత్సవ దేవతమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పల్లకిపై ఊరేగింపు చేపట్టారు. అనంతరం రావణసుర వధను గ్రామస్తులు తిలకించారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక పోలీస్‌లు ముందస్తుగా భారీ బందోబస్తు చర్యలు చేపట్టారు. దీంతో దసరా వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి.



దామెరలో..



నడికూడలో ఊరేగింపు..



ఆత్మకూరు: రావణసుర వధను ప్రారంభిస్తున్న ఏసీపీ



ఐనవోలు: పోలీస్‌స్టేషన్‌లో ఆయుధ పూజ..



శాయంపేటలో ఊరేగింపు..

ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం

వేలేరు : స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో బీజేపీ గెలుపు ఖాయమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గుండె విజయరామారావు అన్నారు. మండలంలోని కమ్మరిపేటలో గల ఆయన స్వగృహంలో ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమం సమయంలో కడియం శ్రీహరి ఎక్కడ ఉన్నారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. తాను ఉద్యమకారుడినైతే, కడియం శ్రీహరి ఉద్యమ ద్రోహి అని మండిపడ్డారు. ఉద్యమకారులపై అక్రమ కేసులు పెట్టించిన కడియం శ్రీహరికి ఓటు అడిగే నైతిక హక్కు లేదని విమర్శించారు. కడియం శ్రీహరి దళిత దొర అయితే.. కాంగ్రెస్ అభ్యర్థి సింగపురం ఇంధిర దళిత దొరసాని అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లు ప్రతీ ఓటరును కలిసి కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ ఐలోని అంజిరెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చిలుక విజయరావు, కో కన్వీనర్ గురిజాల వీరన్న, వేలేరు, ధర్మసాగర్, చిల్పూరు మండలాల అధ్యక్షులు కాట్రేవుల రాజు, గంకిడి శ్రీనివాస్‌రెడ్డి, దిలీప్, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లు, బూత్ అధ్యక్షులు, ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విజయరామారావు

అర్హులు ఓటుహక్కు వినియోగించుకోవాలి



ఊరుగొండలో కవాతు నిర్వహిస్తున్న ఏసీపీ కిశోర్‌కుమార్, పోలీసులు

దామెర: మండలంలోని అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని పరకాల ఏసీపీ కిశోర్ కుమార్ అన్నారు. మండల కేంద్రంతో పాటు ఊరుగొండలో మంగళవారం పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును ప్రలోభాలకు లొంగకుండా, నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ మల్లేష్, ఎస్సై ముత్యం రాజేందర్, ఏఎస్సైలు సిద్ధయ్య, రాజు, సిబ్బంది యాకయ్య, అశోక్, రమేష్, శ్రీనివాస్, రాము, మధు, సీఆర్పీఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విశ్వరూప మహాసభతోనే భవిష్యత్

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

హన్మకొండ: నవంబర్ రెండో వారంలో హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభ ద్వారా విద్యా, ఉద్యోగ, సంక్షేమ రాజకీయాల్లో మాదిగ జాతి భవిష్యత్‌ను నిర్ణయిస్తుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నా రు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 4వ డివిజన్ పరిధిలోని పెద్దమ్మగడ్డలో మంగళవారం రాత్రి మాదిగల విశ్వరూప జిల్లాస్థాయి సన్నాహక సభ గద్దల సుకుమార్ మాదిగ అధ్యక్షతన జరిగింది. సభకు ముఖ్య అతిథిగా మంద కృష్ణ మాదిగ హాజరై మాట్లాడారు. తెలంగాణలో ఎన్నికలు జరుగుతున్న సమయంలో మాదిగలు పార్టీల చుట్టూ తిరిగితే మిగిలేది శూన్యమే అని అన్నారు. నిజంగా రాజకీయ పార్టీలకు చిత్తశుద్ధి ఉంటే ఇన్నేళ్లు వర్గీకరణ కోసం ఎందుకు పోరాటం చేయాల్సి వస్తుందన్నారు. అందుకే రాజకీయ పార్టీల చుట్టూ తిరగకుండా జాతి భవిష్యత్ కోసం ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పార్టీలకు అతీతంగా హక్కుల సాధనకు కలసిరావాలని పిలుపునిచ్చారు. లక్షలాది మందితో మాదిగల విశ్వరూప మహాసభను నిర్వహిస్తున్నామని, ఇళ్లకు తాళాలు వేసి మాదిగలంతా పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాల ని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద నరేష్ మాదిగ, మాజీ కా ర్పొరేటర్ డిన్నా, రంజిత్, శ్రీనివాస్, డగ్లస్, దయాకర్, దినేష్, శ్రీనివాస్, శాంతికుమార్, రాజు, రవికుమార్, భిక్షపతి, నారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

ప్రశాంతంగా ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు



శాయంపేట : నృత్యాలు చేస్తున్న మహిళలు



ఆత్మకూరులో దుర్గామాత పూజలో భక్తులు

- భక్తిశ్రద్ధలతో ముగిసిన నవరాత్రోత్సవాలు
- వైభవంగా అమ్మవారి ఊరేగింపు

ఆత్మకూరు: మండల కేంద్రంలోని పోచమ్మసెంటర్ వద్ద శ్రీవేణుగోపాలస్వామి భజనమండలి ఆధ్వర్యంలో చేపట్టిన దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. అర్చకులు మాధవమూర్తి ఉద్వాసన పూజలు చేశారు. కాగా బుధవారం శోభాయాత్ర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

శాయంపేట: మండల కేంద్రంలోని శివమార్కేండయ ఆలయంలో చేపట్టిన దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. విగ్రహదాత, వరంగల్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లెక్కల లక్ష్మీజలంధర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి శోభాయాత్రను ప్రారంభించారు. భక్తులు మంగళహారతులతో స్వాగతం పలుకుతూ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం దేవుని చెరువులో దేవిమాతను నిమజ్జనం చేశారు. అర్చకులు రాజుకుమార్, ఆలయ కమిటీ చైర్మన్ బాసాని సూర్యప్రకాశ్, భక్తులు ఆదిరెడ్డి. తిలక్, గోపాల్, చంద్రమౌళి, రమేష్ పాల్గొన్నారు.

కమలాపూర్: మండల కేంద్రంతో పాటు ఉప్పల్, మర్రిపల్లిగూడెం, గూడూరు, శనిగరం, దేశరాజుపల్లి, గుండేడు గ్రామాల్లో దుర్గామాత నిమజ్జనోత్సవాలు సోమవారం, మంగళవారం ఘనంగా నిర్వహించారు. దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా రోజుకో రూపంలో దర్శనమిచ్చిన దుర్గామాతను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో ఊరేగించి ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

పరకాల: దేవీ నవరాత్రోత్సవాలు ముగింపు సందర్భంగా కుంకుమేశ్వరస్వామి దేవస్థానంలో ఆలయ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో భక్తులు త్రిశూల స్నానమాచారించారు. అనంతరం కోమాళ్లపల్లి సంపత్‌కుమార్ శర్మ, ప్రధాన అర్చకుడు కోమాళ్లపల్లి నాగభూషణంశర్మ సోమవారం రుద్ర హోమం, మంగళవారం అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. శివాలయం, కన్యకాపరమేశ్వరి దేవస్థానం, స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు.



కమలాపూర్ : శోభాయాత్రలో దుర్గామాతకు టెంకాయ కొడుతున్న సర్పంచ్ విజయ

సిద్ధిధాత్రి అలంకరణలో భ్రమరాంభిక



సిద్ధిధాత్రి అలంకరణలో భ్రమరాంభిక

ఐనవోలు: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు సోమవారం మండల కేంద్రంలోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో భ్రమరాంభిక అమ్మవారు సిద్ధిధాత్రి అలంకారణలో భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీచక్రార్చన, నవావర్ణనపూజ, ఖడ్గమాల, విజయ దశమిని పురస్కరించుకుని నవకలశ స్నపనం, సుగంధ పరిమళ ద్రవ్యాలతో విశేష అభిషేకం, భ్రమరాంభిక నిజదర్శనం, నవశక్త్యార్చన, శమీపూజ, ఆయుధ పూజ, త్రిశూలస్నానం, సామ్రాజ్య పట్టాభిషేకం, మహానివేదన, నీరాజన మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు విశేషంగా జరిగాయి. ఆలయ ఉపప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్ మాట్లాడుతూ సిద్ధిధాత్రి రూపంలో అమ్మవారు అణిమ, మహిమ, గరిమ, లఘిమ, ప్రాప్తి, ప్రాకామ్యము, ఈశ్విత్వము, వశిత్వము అష్టసిద్ధులు ప్రసాదిస్తుందని తెలిపారు. ఈమె కరుణ వలన పార్వతీదేవి శివుడి అర్ధ శరీరం పొందినట్లుగా పురాణ కథనం చెబుతుందన్నారు. అమ్మవారి వాహనం సింహం, చతుర్భుజాలతో కమలంపై ఆసీనురాలై ఉంటుందన్నారు. కుడి వైపు చేతులలో శంఖం, గద, ఎడమ వైపు చేతులలో శంఖం, కమలం ఉంటుందని భక్తులకు వివరించారు. ముఖ్య అర్చకుడు పాతర్లపాటి శ్రీనివాస్, మధుకర్ శర్మ, వేద పండితులు పురుషోత్తమశర్మ, విక్రాంత్‌వినాయక్‌జోషి, అర్చకులు మధు, భాను ప్రసాద్, నరేష్, శ్రీనివాస్, దేవేందర్, ఉద్యోగులు, పాల్గొన్నారు.

ఇందిర గెలవాలని పూజలు



పూజ చేస్తున్న సంపత్

వేలేరు : కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సింగపురం ఇందిర ఘన్‌పూర్ ఎమ్మెల్యేగా గెలవాలని ఆపార్టీ పీచర గ్రామశాఖ కన్వీనర్ మండల సంపత్‌కుమార్ మంగళవారం దుర్గామాతకు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేసి ఇందిరను గెలిపించాలని కోరారు. దుర్గామాత ఆశీస్సులు ఉండాలని కోరారు.

సారూ స్పందించరూ..

ఎల్కతుర్తి: ఇంటింటికి శుద్ధిచేసిన జలాలను సరఫరా చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ క్షేత్రస్థాయిలో అమలవ్వడం లేదు. స్వచ్ఛమైన నీరు తాగాల్సిన ప్రజలు కలుషితమైన నీటిని తాగుతూ అనారోగ్యాల బారిన పడతున్నారు. మండలంలోని దండేపల్లి ఆరో వార్డులో పైపులైన్ లీకేజీతో తాగు నీరు కలుషితమవుతోంది. అనారోగ్యం బారిన పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని కాలనివాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కాలనివాసులు కోరారు.



పైపులైన్ లీకేజీతో కలుషితమవుతున్న తాగునీరు

అమెరికాలో బతుకమ్మ వేడుకలు



వరంగల్: తెలంగాణకు చెందిన పలువురు మహిళలు అమెరికాలో తాము నివసించే ప్రాంతాల్లో బతుకమ్మ పండుగలను ఘనంగా నిర్వహించారు. అమెరికాలోని కెనిటికట్ రాష్ట్రంలో అక్కడి తెనా(తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా) సభ్యుడు హనుమకొండకు చెందిన యర్రబెల్లి మనోహర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో తెలంగాణకు చెందిన మహిళలు పాల్గొన్నారు. అలాగే టెక్సాస్‌లో హనుమకొండకు చెందిన రిటైర్డ్ రిజిస్ట్రేషన్ అధికారి సిద్ధం రమేష్ కుటుంబ సభ్యులు ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. ప్రసాద్, కమల్, కరుణాకర్, సతీష్, అర్చన, సంగీత పాల్గొన్నారు.